ప్రజాశక్తి

మంగళవారం 30 సెప్టెంబర్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

రైతులకు దెబ్బ మీద దెబ్బ

లంక గ్రామాల నుంచి మరపడవల ద్వారా పంటలను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు...

వరద నీటిలో మునిగిన పసుపు పైరు..

- ఇప్పటికే మూడుసార్లు నష్టం
- ప్రభుత్వ సాయం శూన్యం
- వరద తాకిడితో కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలోని రైతులకు ఈ ఏడాది కోలుకోలేని దెబ్బతగిలింది. ప్రధానంగా కొల్లిపర, దుగ్గిరాల, చేబ్రోలు, పెదకాకాని మండలాల్లోని వివిధ గ్రామాల్లో వరి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది దెబ్బమీద, దెబ్బ తగిలింది. గత మూడునెలల కాలంలో మూడు సార్లు అధిక వర్షాలు, వరద వల్ల పైర్లు దెబ్బతిన్నాయి. గతనెల 13,14 తేదీల్లో కురిసిన అధిక వర్షాలతో ముంపు సమస్య ఏర్పడి వరి పైరు దెబ్బతింది. జులైలో కూడా ఇదే పరిస్థితి తలెత్తింది. మొత్తంగా రెండు సార్లు పంట దెబ్బతిని 25 వేల మంది రైతులు నష్టపోయారు. దాదాపు 70 వేల ఎకరాల్లో పంట తిరిగి వేసుకున్నా ప్రభుత్వం నుంచి పరిహారమేమీ రాలేదు. నిబంధనల ప్రకారం పంట చేతికి వచ్చే దశలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగితే పరిహారం వస్తుందని అధికారులు తెలిపారు. వెదపద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక వర్షాలకు ముంపు సమస్య ఏర్పడి పైర్లు దెబ్బతిన్నాయి. నీట మునిగి రైతులు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోయారు. కొంత మంది రైతులు రెండు సార్లు వెదపద్ధతిలో సాగు చేశారు. రెండుసార్లు వరి వేసిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈ విషయంలో తామేమీ చేయలేమని ఉన్నతాధికారులు కూడా నిస్సహాయత వ్యక్తం చేశారు.

తాజాగా కృష్ణానది వరదల వల్ల కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో తిరిగి ముంపు సమస్య తలెత్తింది. ఈ రెండు మండలాల్లోని మరికొన్ని గ్రామాల్లో వరి పైరు సాగు చేసిన భూముల్లోకి నీరు చేరింది. ఎక్కువ రోజు నీరు నిల్వ ఉంటే పైర్లు దెబ్బతింటాయని అధికారులు చెబుతున్నారు. ఈ రెండు మండలాలతోపాటు తాడేపల్లి, అమరావతి, తుళ్లూరు మండలాల్లో కూడా ముంపు సమస్య ఏర్పడింది. కొల్లిపర

2లో

ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

తాళ్లాయపాలెం పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

శాశ్వత పరిష్కారం చూపండి

పునరావాస కేంద్రాల్లోని వరద ముంపు బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - తుళ్లూరు

వరద ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి భోజనంతో సరిపెట్టకుండా ముంపు నుంచి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలైన తాళ్లాయపాలెం, ఉద్దండరాయునిపాలెంలో సిపిఎం బృందం సోమవారం పర్యటించింది. కృష్ణా నదికి ఎగువ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున నీరు వచ్చిచేరుతుండడంతో తాళ్లాయపాలెం లంక వాసులను పునరావాస కేంద్రానికి తరలించగా వీరివద్దకు సిపిఎం నాయకులు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కృష్ణా నది ఉధృతితో లంకల్లోని ఇళ్లల్లోకి హఠాత్తుగా నీరొచ్చిందని, వరదలొచ్చిన ప్రతిసారి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం కాకుండా వరద ముప్పు నుంచి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం కోసం సురక్షిత ప్రాంతంలో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు,నిర్మాణం చేపట్టాలని కోరారు. తక్షణ సాయంగా ప్రతి కుటుంబానికి రూ.10 వేల సాయం అందించాలన్నారు. రాజధాని నిర్మాణం కారణంగా వ్యవసాయ పనులు లేవని, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక వ్యవసాయ కార్మికులుగా ఉన్నవారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో స్థానికులు లేరని, వేరే రాష్ట్రాలకు చెందిన కార్మికులే ఉన్నారని తెలిపారు. రాజధాని భూసమీకరణ సందర్భంగా వ్యవసాయ కార్మికులుగా ఉన్నవారికి ఏడాది పొడవునా పనులు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం

2లో

రావిపాడు గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసరావు

పర్చూరు వరకు గుంటూరు ఛానల్ విస్తరణ కోసం

భూ సేకరణకు రెండు గ్రామాల్లో సభలు

- ప్రభుత్వం ప్రకటించిన ధరపై రావిపాడు రైతుల అభ్యంతరం
- మార్కెట్ ధరలో సగానికంటే తక్కువగా చెప్పారని అసంతృప్తి
- పరిహారంగా మరోచోట భూమి ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - పెదనందిపాడు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించడానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం సోమవారం మండలంలోని రావిపాడు, జిజి పాలెం గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఆర్‌డిఒ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు జిజి పాలెంలో రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఎకరం రూ.12 లక్షలు ఉందని, దీన్ని రెండున్నర రెట్లు పెంచి రూ.30 లక్షల నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. గ్రామంలో 22 మంది రైతులకు సంబంధించి, 23.42 ఎకరాలు అవసరమని చెప్పారు. రావిపాడులో రిజిస్ట్రేషన్ విలువ రూ.8 లక్షలు ఉందని, రెండున్నర రెట్లు పెంచి, రూ.20 లక్షలు నష్టపరిహారం ఇస్తామని, 35 మంది రైతుల వద్ద నుండి

2లో

నేడు 'ట్రంప్ ఉగ్రవాద నిర్ణయాలు - మోడీ మౌనం'పై సభ

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ

'ట్రంప్ ఉగ్రవాద నిర్ణయాలు - మోడీ మౌనం' అంశంపై మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ రాఘవయ్య పార్క్ సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో సభ జరుగుతుంది. సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు ప్రసంగిస్తారు.

ప్రేమ పెళ్లిని నిరాకరించడంతో ఆత్మహత్య

ట్రైన్‌కు ఎదురు వెళ్లి యువకుడు మృతి

విషయం తెలిసి యువతి కూడా ...

(వార్త మెయిన్‌లో)

విలేకర్లతో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

గుర్తింపు కార్డులు, రుణాలు, ఇతర ప్రయోజనాల కోసం

13, 14 తేదీల్లో కౌలురైతుల ఆందోళనలు

ప్రజాశక్తి-గుంటూరు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 13, 14 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తామని ఏపి కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు తెలిపారు. బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం కౌలు రైతులకు మేలు చేస్తున్నామంటూ తెచ్చిన కొత్త చట్టం వల్ల మరింత నష్టం జరిగిందని, కౌలురైతు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమాని సంతకం కావాలనే నిబంధన పెట్టటం వల్లే ఈ సమస్య వచ్చిందని చెప్పారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తామని, కౌల్దార్లకు మేలు చేస్తామని ఎన్నికల్లో టిడిపి హామీచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరవుతున్నా చట్టాన్ని మార్చలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో ముసాయిదా చట్టం తయారు చేసి, రాష్ట్రంలోప్రాంతీయ సభలు పెట్టి హడావుడి చేసినా ఇప్పుడు దాని ఊసే ఎత్తట్లేదని విమర్శించారు. గుర్తింపు కార్డులు ఇవ్వకపోవటంతో బ్యాంకు రుణాలుగానీ, ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ, పంట పరిహారాలు ఏవీ దక్కట్లేదని ఆవేదన వెలిబుచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల ప్రకారం రైతు మిత్ర, జాయింట్ లయబులిటీ గ్రూపులలోని రైతులకు రూ.2లక్షల చొప్పున ఇవ్వాల్సిన రుణం కూడా ఇవ్వట్లేదన్నారు. కౌలురైతులకు కూడా ఈ-క్రాప్ నమోదు చేసి సబ్సిడీలు, ఎరువులు, పురుగు మందులు, నష్ట పరిహారాలు వర్తింపజేయాలని కోరారు. కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో షుమారు లక్ష మంది కౌలురైతులున్నారని, 70 శాతం భూమిని కౌలురైతులే సాగు చేస్తున్నారని తెలిపారు. దేవాలయ భూముల కౌలు రైతులందరికీ అధికారులే

2లో

జిఎస్‌టి తగ్గింపులపై ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొనే కేంద్ర ప్రభుత్వం జి.యస్.టి 2.0 ను ప్రవేశ పెట్టిందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో జియస్‌టి 20పై అధికారులు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జిఎస్‌టి తగ్గించారన్నారు. జిఎస్‌టి తగ్గింపులపై నగరంలోని 57 డివిజన్లల్లోని ప్రజలకు డోర్ టూ డోర్ తిరిగి వివరించాలన్నారు.నిత్యావసర సరుకులు, ఔషధాలు వంటి వాటికి గణనీయంగా తగ్గిందని చెప్పారు. వ్యాపారులకూ అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కమిషనర్ చల్లా ఓబులేసు, జిఎస్‌టి డిప్యూటి కమిషనర్ పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ అనసూయ పాల్గొన్నారు.

వృద్ధురాలి సమస్యపై స్పందించిన సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి - తెనాలి

లక్ష్మీకాంతమ్మతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

వృద్ధ మహిళ సమస్యపై సబ్ కలెక్టర్ సంజనా సింహ్ స్పందించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో అర్జీ సమ ర్పించేందుకు ఒక వృద్దురాలు వచ్చింది. ఆమె సమస్య పై సబ్ కలెక్టర్ స్పందించారు. చేబ్రోలు మండలం శలపాడుకు చెందిన పోలవరపు అనంత లక్ష్మీకాంతమ్మను మోసం చేసి, తన పొలంలో పాటు మతి స్థిమితం లేని కుమార్తె పొలాన్ని అల్లుడు బల వంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం తెలుసుకున్నారు. బాధితురాలి నుంచి అర్జీ స్వీకరించి, ఆమెకు భరోసా కల్పించారు. మరి కొన్ని అర్జీలను ప్రజలు నుంచి స్వీకరిం చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

ప్రజాశక్తి - చేబ్రోలు

పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండల కేంద్రమైన చేబ్రోలు రైతు సేవ కేంద్రంలో నిర్వహించిన శిక్షణలో మండల వ్యవ సాయాధికారి బి.ప్రియదర్శిని మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలకు సంబంధించిన వివరాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. పంటకు సంబంధించిన సర్వే నంబరులో పంట ప్రయోగం కొరకు ప్లాటు ఎంపిక ఎలా చేయాలనే వివరాలపై మండల గణాంకాధికారి ధర్మారావు సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లలో తనిఖీ చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ పరిసర ప్రాంతాలలోని హాస్టళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ పాయింట్లలో ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేపట్టాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జాన్‌పాల్ మాట్లాడుతూ నాణ్యత లేని వంట నూనెతో చేసిన ఆహార పదార్థాలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ అధికారులు తనిఖీలు చేపట్టలేదన్నారు. గుంటూరు జిల్లా పరిసర ప్రాంతంలో కలుషిత నీరు, ఆహారం వలన ఎంతో మంది ప్రజలు అనారోగ్యానికి గురై మృతి చెందిన పరిస్థితుల దృష్ట్యా ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిబిఆర్ సి పల్నాడు జిల్లా అధ్యక్షులు మల్లెల చెన్నప్ప పాల్గొన్నారు.

సరస్వతి అలంకారం

ప్రజాశక్తి - గుంటూరు

నగరంలోని సాయి నగర్ శ్రీ దుర్గా మల్లేశ్వరి అమ్మవారి దేవస్థానం త్రిశక్తి పీఠంలో సోమవారం సరస్వతి అలంకారం జరిగింది మూలా నక్షత్రం సందర్భంగా దేవస్థానం ధర్మకర్త స్వామి చిన్నపిల్లలకు విద్యాభ్యాసం నుంచి వారికి చాక్లెట్లు , పెన్నులు ఇచ్చారు ఒకటవ తారీఖున అన్నదాన కార్యక్రమం జరుగుతుందని భక్తులందరూ అన్నదాన కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని తెలిపారుఅమ్మవారికి లడ్డు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి , చాక్లెట్లు పెన్నులు శ్రీ సాయి టూర్ హబ్ డైరెక్టర్ పళ్ళ శశిధర్ సమర్పించారు. కార్యక్రమంలో మస్తాన్ రెడ్డి, అమ్మ ఈశ్వరమ్మ భక్తులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో సామాన్యులకు మేలు : నశీర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

లాలాపేటలో దుకాణాలలో వ్యాపారులతో మాట్లాడుతున్న నశీర్ అహ్మద్

సామాన్య కుటుంబాల ఆర్థిక అభివృద్ధికే ప్రభుత్వం జి.ఎస్.టి తగ్గించినట్టు శాసన సభ్యులు నజీర్ అహ్మద్ అన్నారు. రాష్ట్ర జి.ఎస్.టి అధికారులతో కలిసి పట్టణంలోని లాలాపేట మార్కెట్ లో పలు దుకాణాలను సోమవారం సందర్శించారు. దుకాణదారులతో ముఖాముఖి మాట్లాడి జి.ఎస్.టి తగ్గింపుపై వారిలో ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. పుస్తకాలు, ఇతర సామగ్రిపై ఎంత మేర జి.ఎస్.టి గతంలో ఉన్నది, ప్రస్తుతం ఎంత మేర తగ్గింపులో ఉన్నది తెలుసుకున్నారు. జి.ఎస్.టి తగ్గింపు వలన ధరల తగ్గుదల వివరాల బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జి.ఎస్.టి తగ్గింపుతో సామాన్య కుటుంబాలకు అత్యంత ప్రయోజనం కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 4 స్లాబ్ లుగా ఉన్న జి.ఎస్.టిని రెండు స్లాబ్ లుగా తగ్గించిందని చెప్పారు. జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ గీతా మాధురి మాట్లాడుతూ దసరా నుండి దీపావళి వరకూ ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో వివిధ అవగాహనా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని అన్నారు. సామాన్య ప్రజలకు గృహ, నిత్యావసర వస్తువులు, ఆహారం, మందులు, విద్యా, స్టేషనరీ, బట్టలు, క్రీడా వస్తువులు, మహిళలు, పిల్లలు, రవాణా అంశాలకు సంబంధించి జిఎస్టి తగ్గింపు వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. జి.ఎస్.టి డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, సహాయ కమిషనర్లు వెంకటేశ్వరరావు, ఆర్.అనసూయ, మల్లిఖార్జున, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టితో రూ.8 వేల కోట్ల ప్రయోజనం

ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తిళ-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిఎస్‌టి రెండో దశ సంస్కరణల వల్ల రాష్ట్ర ప్రజలకు రూ.8 వేల కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంస్కరణలు రైతులు, మహిళలు, చిన్న వ్యాపార వర్గాలకు గేమ్‌చేంజర్ అవుతాయని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు, మందులు, ట్రాక్టర్లు వంటి అవసరమైన వస్తువులపై పన్ను తగ్గింపుతో ప్రజల ఖర్చులు తగ్గి కొనుగోలు శక్తి పెరుగుతుందని వివరించారు. ధరలు తగ్గడం వలన ఎంఎస్‌ఎంఈ రంగం బలోపేతం అవుతుందని, వ్యాపారులు, ఉద్యోగులు, నిపుణులందరికీ లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఎరువులు, వ్యవసాయ యంత్రాలు, కోల్డ్ స్టోరేజ్, సాగునీటి సేవలపై జిఎస్‌టి పూర్తిగా తొలగించారని తెలిపారు. సానిటరీ నాప్‌కిన్స్, మహిళల ఆరోగ్య కిట్లపై జీఎస్టీ పూర్తిగా రద్దు కావడం, హ్యాండ్లూమ్ చీరలు, హ్యాండీక్రాఫ్ట్‌పై పన్ను తగ్గింపుతో మహిళా కళాకారిణులకు పెద్ద ఊరట లభిస్తుందని, మహిళా సాధికారతపైనా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు తెలిపారు.

శాశ్వత పరిష్కారం చూపండి

(మొదటి పేజీ తరువాయి)

మాటతప్పిందన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో పనులకు వెళితే నాలుగురోజుల తరువాత యాజమాన్యం ఏదో ఒక సాకు చెప్పి మాన్పించి వేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో పేదలు ఐక్యంగా పోరాడితేనే ఉపాధి దక్కుతుందన్నారు. సింగపూర్ కన్సార్టియం పేరుతో తాళ్లాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, లింగాయపాలెం గ్రామాలను తొలగించాలనే యత్నాన్ని పోరాటం ద్వారా నిలువరించ గలిగామని చెప్పారు. రాజధానిలో భూమిలేని నిరు పేదల కోసం ప్రభుత్వంపై పోరాడితే అమరావతి సామాజిక పింఛను రూ.2,500 ఇచ్చారని, ప్రస్తుతం రూ.5 వేలు అందిస్తున్నారని తెలిపారు. అసైన్డ్ రైతులకు సమాన ప్యాకేజి, ఉచిత విద్య, వైద్యం తదితర హామీల అమలు కోసం ప్రతి ఒక్కరూ గళం విప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు షేక్ జానీ, కె.ఆంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ సేకరణకు రెండు గ్రామాల్లో సభలు

(మొదటి పేజీ తరువాయి)

38.50 ఎకరాలు సేకరిస్తామని తెలిపారు. అయితే అధికారులు ప్రకటించిన ధరపై రావిపాడు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పొలాల బహిరంగ మార్కెట్ విలువ ఎకరం రూ.50 లక్షలుకాగా పరిహారం రూ.20 లక్షలు ఇస్తామనడం సరికాదన్నారు. నష్టపరిహారం కాకుండా తాము కోల్పోతున్న భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. సన్న, చిన్న కారు రైతులైన తమకు వ్యవసాయం తప్ప మరో పని తెలియదని చెప్పారు. భూ సేకరణ చేయదలిస్తే బహిరంగ మార్కెట్‌ధర ప్రకారం రూ.50 లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు విరుద్ధంగా ముందుకెళ్తే ప్రతిఘటిస్తామన్నారు. ఈ విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్‌డిఓ సమాధానమిచ్చారు. సభల్లో డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరిముల్లా, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో కౌలురైతుల ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత తీసుకొని గుర్తింపు కార్డులిచ్చి, పంట రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. రైతుసేవా కేంద్రాల్లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రైతుల భూముల్ని కార్పొరేట్ సంస్థలకు బలవంతంగా కట్టబెడుతోందని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామకృష్ణ, ఎం.నాగమల్లేశ్వరరావు, సాంబిరెడ్డి, కృష్ణ, అమ్మిరెడ్డి, నిలాంబరం పాల్గొన్నారు.

రైతులకు దెబ్బ మీద దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

మండలంలోని పలు గ్రామాల్లో అరటి, కంద, పసుపు, కూరగాయాల తోటలు ముంపునకు గురయ్యాయి. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. కొల్లిపర, కొత్తూరులంక, బొమ్మువారిపాలెం, అన్నవరపు లంక గ్రామాల్లో పైర్లు దెబ్బతిన్నాయి. ముంపునకు కంద, పసుపు దుంపలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరటి కూరగాయలు పూల తోటలు కూడా కొన్ని ప్రాంతాల్లో మునిగి ఉన్నాయి. దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు కృష్ణా పరివాహక ప్రాంతాలు అయిన దాచేపల్లి, అచ్చంపేట, అమరావతి, మాచవరం తదితర మండలాల్లో పత్తి పైరు నీట మునిగింది. అలాగే తాగేపల్లి, తుళ్లూరు మండలాల్లో కూడా వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. గత మూడు నెలలుగా అధిక వర్షాల ముంపు సమస్య ఏర్పడగా తాజాగా కృష్ణానదికి వరదప్రవాహం రావడంతో ఈ నష్టం మరింత పెరుగుతోంది.

పామును తాకుతూ ఉధృత ప్రవాహం

ప్రజాశక్తి- తాడేపల్లి

కృష్ణానది వరదనీరు పోటెత్తి సీతానగరం పుష్కర ఘాట్‌ల వద్ద వరద నీరు నాగపాము విగ్రహాన్ని తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఘాట్‌ల వద్ద నీటిలో సందర్శకులు దిగకుండా డీఎస్పీ మురళీకృష్ణ ముళ్లకంచె వేయించడంతోపాటు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పట్టణంలోని మహానాడు కృష్ణా నది ఒడ్డున నివసిస్తున్న పేదలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా సోమవారం పరామర్శించారు. ఇబ్బందేమీ రాకుండా చూసుకుంటామన్నారు. కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట తహశీల్ధార్ సీతారామయ్య ఉన్నారు.

సాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక కొనసాగుతోంది. సోమవారం సాగర్ 26 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 24 గేట్లను 15 అడుగులు, 2 గేట్లను 20 అడుగుల వరకు ఎత్తి 5,41,516 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 5,91,456 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇదేమొత్తంలో సాగర్ నుండి దిగువకు విడుదల చేస్తున్నారు. కుడికాల్వకు 9,533 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,333, ఎస్ఎల్బీసీకి 1,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయ నీటిమట్టం 585.30 అడుగుల వద్ద ఉంది. ఇది 298.3005 టీఎంసీలకు సమానం.

ప్రేక్షకుల జేజేలు అందుకుంటున్న పౌరాణిక పద్య నాటకాలు

మూడో రోజుకు చేరిన వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి

అయోధ్య రామయ్య నాటకంలో ఓ సన్నివేశం

పుత్ర దిచ్చేత్ పద్య నాటకంలో దశ్యం

పట్టణానికి చెందిన కళల కాణాచి, ఆర్ ఎస్ ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వీణ అవార్డ్స్ నాటక, నాటిక ప్రదర్శనలు సోమవారం మూడో రోజుకు చేరాయి. స్థానిక కొత్తపేట రామకష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలలో భాగంగా ఒంగోలుకు చెందిన శ్రీ కళా ప్రకాశం వారి 'పుత్ర దిచ్ఛేత్' పద్య నాటకాన్ని తొలి ప్రదర్శనగా ప్రదర్శించారు. శారదా ప్రసన్న రచనకు టీవీ శివప్రసాద్ దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా కాకినాడకు చెందిన కుమార రామ భీమేశ్వర నాట్యమండలి వారి'అయోధ్య రామయ్య' నాటకాన్ని ప్రదర్శించారు డాక్టర్ జంధ్యాల సుబ్బలక్ష్మి రచనకు ఎస్.కె అమీర్ దర్శకత్వం వహించారు. పౌరాణిక పద్య నాటకాలు ప్రేక్షకుల జేజేలందుకుంటున్నాయి. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రేక్షకుల వన్స్ మోర్ నినాదాల మధ్య నాటకాలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి.

సాంఘిక నాటిక ప్రదర్శనలలో...

నాటక ఉత్సవాలలో భాగంగా సాంఘిక ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సాంఘిక నాటక విభాగంలో విజయవాడ దశ్యవేదిక సాంస్కతిక సంస్థ ఆధ్వర్యంలో ఇది ప్రమాదానికి సంకేతం' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఆకురాతి భాస్కరరావు రచనకు ఎస్కె మిత్రో దర్శకత్వం వహించారు. సాంఘిక నాటికల విభాగంలోబళ్ళారికి చెందిన రఘురామ కళా మిత్ర మండలి నేటి కూసింది హస్తం నాటికను ప్రదర్శించారు. నేతి రఘురామ రచనకు ఎన్ సూర్య దర్శకత్వం బాధ్యతలు నిర్వహించారు. అనంతరం సహజ కవి ఐనాల మల్లేశ్వర రావు దశ సహస్రాధిక పద్య నాటిక విపంచి బిరుదుతో సత్కరించారు. ప్రదర్శనలను బుర్ర సాయి మాధవ్, చెరుకుపల్లి సింగారావు పర్యవేక్షించారు.

మార్కు రూపస్, షేక్ అర్షద్ (ఫైల్ ఫొటోలు)

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతు

ప్రజాశక్తి - నకరికల్లు

నాగార్జున సాగర్ మెయిన్ కెనాల్‌లో ఈతకు వెళ్లి ఇద్దరి విద్యార్థులు గల్లంతైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లికి చెందిన షేక్ షమీర్ వలి, చిలకలూరిపేటకు చెందిన షేక్ అర్షద్, చీరాల నియోజకవర్గం ఈపూరుపాలెంకు చెందిన దారబడి మార్కు రూపస్, బాపట్ల జిల్లా వెదుళ్ళ పల్లికు చెందిన గుత్తి వరుణ్ నలుగురు గుంటూరు దగ్గర లాంలోని అర్క కాలేజీలో ఇంటర్ బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. కాలేజీకి దసరా సెలవులు ఇవ్వడంతో గుండ్లపల్లిలోని స్నేహితుడైన షమీర్‌వలి దగ్గరకు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఈతకు వెళ్లడానికి ద్విచక్ర వాహనంపై షమీర్ వలి మార్కురూపస్, ఆర్షద్‌ను తీసుకువెళ్లి గుండ్లపల్లి లోని మెయిన్ కెనాల్ దగ్గర వదిలి పెట్టి ఇంటికి వెళ్లి వరుణ్‌ను తీసుకొస్తానని వెళ్లి వచ్చేలోపు ఇద్దరు కనపడకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఒడ్డుపైన విద్యార్థుల చెప్పులు ఉన్నాయి. కంగారు పడి విషయం ఇంటి దగ్గర ఉన్న పెద్దవారికి తెలియ జేయడంతో సమాచారం పోలీసులకు అందజేశారు. సంఘటన స్థలానికి వెళ్లిన ఎస్సై సతీష్ గాలింపు చర్యలు చేపట్టారు. మెయిన్ కెనాల్ ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందజేసినట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించండి : కలెక్టర్

జిఎస్‌టి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుండి ఆమె సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్, తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, గ్రామ, వార్డు సచివాలయ సేవలు, హౌసింగ్ కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపులపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించాలన్నారు. వర్షకాలం నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సురక్షితమైన తాగునీరు సరఫరాతో పాటు, పారిశుధ్యాన్ని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, జెడ్పీ సిఇఒ జ్యోతిబసు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిఎస్‌టి తగ్గింపుపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి

ప్రజాశ క్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్ట ణం తూర్పు వైపున బైపాస్ రోడ్డు ప్రాంతం దిన దినాభివృద్ధి చెందుతోందని, అందుకు తగిన విధంగా ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం రాత్రి తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ప్రజల అవసరాల కోసం రైతు బజార్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీం సమీపంలో ఉన్న కాల్వకట్ట స్థలాన్ని వినియోగించుకోవచ్చని అధికారులకు సూచించారు. మాంసం విక్రయాలు కోసం స్టాల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పంపిణీ స్కీం కాలువ పక్కన మాంసం విక్రయాలు జరుగుతున్నాయనీ, వ్యర్థాలన్నింటిని కాలవలో పడేస్తుండడంతో పర్యావరణం దెబ్బతినడమే కాకుండా అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. అపార్టుమెంట్ల సముదాయం దగ్గర కొన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేషన్ అధికారులను కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం శాఖా కార్యదర్శులు దర్శన విజయబాబు, కోట బాబు రావు, జి అంజిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వర్లు

డిజిటల్ బుక్‌యాప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపుమేరకు డిజిటల్ బుక్ యాప్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరానాగయ్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో వైసిపి కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు, బాధలు గుర్తించి వారికి న్యాయం చేయడానికి, వారిలో మనోధైర్యాన్ని నింపటానికి డిజిటల్ బుక్ అనే ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్త డిజిటల్ బుక్‌యాప్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ మరియు మండల వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు, వైసిపి అభిమానులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రకాశం బ్యారేజ్ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహానికి మండలంలోని కృష్ణా పరీవాహ ప్రాంతమైన కొల్లిపర బొమ్మువాని పాలెం, అన్నవరపు లంక గ్రామాల్లో ఉద్యాన పంట పొలాలు వరద ముంపునకు గురై నీట మునిగాయి. వీటిని సోమవారం జిల్లా ఉద్యానవన అధికారి బి.రవీంద్రబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ జె.డి, ఏడిఏ విజయబాబు, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, తెనాలి ఉద్యాన అధికారి శ్రీనిత్య, ఓఎస్‌డి ఎస్.రత్నం పరిశీలించారు.

జాబ్ మేళాలో 8 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి పరిధిలోని తుళ్లూరు సిఆర్‌డిఏ ప్రాంతీయ కార్యాలయంలోని స్కిల్ హబ్ ప్రాంగ ణంలో సోమవారం స్పెషల్‌డ్రైవ్ జాబ్‌మేళా జరి గింది. మేళాలో భవ్య హెల్త్ సర్వీసెస్, టియువి ఇండియా, మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. 40కి పైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహించగా 45 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 8మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అంద జేశారు. ఏపి ఎస్ఎస్‌డిసి ప్లేస్‌మెంట్‌అధికారి అరుణ కుమారి, సిఆర్‌డిఏ సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతి కుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE, VIJAYAWADA.
O.S. NO.731/2024

Between:
Nutakki Mrudula represented by GPA holder Nutakki Sai Prasad . .... Plaintiff
And
Bellam Laxmana Rao & Others. ....Defendants.

To
Gade Ratna Reddy, S/o. Gade Venkata swamy Reddy, D.No.134-15-1431, Flat No.402, 4th Floor, Akhiya Awas Aparatment, Amaravathi Road, Sriram Nagar, 10th Lane, Gorantla, Guntur District.

Whereas the above Plaintiff filed the suit for declaration and possession of the property bearing D.No.6-48/S2 and as the notice was not received by you through Registered Post and summons, the Paper notice was ordered for your appearance by way of substituted service informing you that the suit is posted to 22-10-2025 for your appearance. You are requested to make appearance either personally or through an Advocate and if you fail to appear, the relief against you will be decided in your absence as if you have no defence.

BY THE ORDER OF HON'BLE COURT.

IN THE COURT OF IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE, VIJAYAWADA.
I.A. NO.959/2024 IN O.S. NO.731/2024

Nutakki Mrudula represented by GPA holder Nutakki Sai Prasad .... Petitioner
And
Bellam Laxmana Rao & Others ....Respondents.

To
Gade Ratna Reddy. S/o.Gade Venkata swamy Reddy, D.No.134-15-1431, Flat No.402, 4th Floor, Akhiya Awas Aparatment, Amaravathi Road, Sriram Nagar, 10th Lane, Gorantla, Guntur District.

Whereas the above Petitioner filed the IA for depositing the rents of leased shops in property bearing D.No.6-48/S2 and as the notice was not received by you through Registered Post and summons, the Paper notice was ordered for your appearance by way of substituted service informing you that the I.A. is posted to 22-10-2025 for your appearance. You are requested to make appearance either personally or through an Advocate and if you fail to appear, the relief against you will be decided in your absence as if you have no defence.

BY THE ORDER OF HON'BLE COURT

దీ గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్., రిజిస్టర్డ్ నెం.1-908

మెడికల్ కాలేజీ రోడ్డు, కన్నావారి తోట, గుంటూరు - 522004.

టెండరు ప్రకటన

షార్ట్ టెండరు నోటీసు: జి.డి.సి.యం.స్ నెం: 02/25-26 తేది 29-09-2025

గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏటుకూరు రోడ్డులో గల ది గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, గుంటూరు నకు చెందిన గోదాముల సముదాయము నందు ఈ క్రింద ఉదహరింపబడిన షెడ్యులు ప్రకారము నిర్మాణములు కూలగొట్టుటకు సదరు డేబ్రీస్ బయటకు తరలించుట అర్హత కలిగి వుండి ఆసక్తి గల కాంట్రాక్టర్ ల నుండి షార్ట్ టెండర్లు కోరడమైనది.

షెడ్యూలు

వ.సంఖ్య	చేయవలసిన పని వివరములు	అంచనా విలువ (రూ.లలో)
1.	Dismantling and removing of Office Building Ground Floor in the premises of GDCMS Ltd., Guntur at Suryadevarapet, Etukuru Road, Guntur	Rs.6,50,000/-
2.	Dismantling and removing of Office Building First Floor in the premises of GDCMS Ltd., Guntur at Suryadevarapet, Etukuru Road, Guntur	Rs.4,50,000/-
3.	Dismantling and removing of Godown No.5 in the premises of GDCMS Ltd., Guntur at Suryadevarapet, Etukuru Road, Guntur	Rs.7,50,000/-
4.	Dismantling and removing of attached verandah□s to godown No. 7in the premises of GDCMS Ltd., Guntur at Suryadevarapet, Etukuru Road, Guntur	Rs.3,50,000/-

పైన ఉదహరించిన కూల్చివేత పనులకు ప్రతి ఒక్క పనికి టెండరు షెడ్యులు విడివిడిగా పొందుటకు రూ. 5000/- విలువ గలిగిన డి.డి లను జాతీయ బ్యాంకుల నుండి ది గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ గుంటూరు వారి పేర తీసి సంబంధిత షెడ్యుళ్ళను ది: 01-10-2025 ఉదయం గం.10.30 ని.ల నుండి ది: 07-10-2025 సాయంత్రం గం. 5.00ల వరకు ఆఫీసు పని దినములలో పొందగలరు. సీల్డు టెండరు ది 08-10- 2025 సాయంత్రం గం.3.00 ల వరకు ప్రధాన కార్యాలయము, గుంటూరు నందు స్వీకరించబడును. సదరు సీల్డు టెండర్లు ది 08-10-2025 సాయంత్రం గం.4.30 ని.లకు టెండరుదారుల సమక్షములో తెరువబడును. వివరముల కొరకు: సెల్ నెం: 9849924429

తేది:29-09-2025

డి.హరిగోపాలం
బిజినెస్ మేనేజరు

శ్రీ వద్రాణం హరిబాబు
పర్సన్-ఇన్-ఛార్జ్

మహారాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో : ఒంగోలు
A.S.No. 67/2024

Between:
అక్కల వెంకటేశ్వర్లు ...అప్పిలెంటు / వాది
And
ది. బ్రాంచ్ మేనేజర్, ఏ.పి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ వగైరాలు ...రెస్పాండెంట్లు / ప్రతివాదులు

నోటీసు

To.
వై. కోటి రాజశేఖర్, తండ్రి శివప్రసాద్, నివాసము D.NO. 7-17-78, 4th Line, శ్రీనగర్, గుంటూరు టౌన్, గుంటూరు జిల్లా.

పై నెంబరు అప్పిల్ సూటులో 2వ రెస్పాండెంటు / ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసు పంపించిననూ మీకు నోటీసు జారీ కానందున శ్రీ కోర్టు వారు మీ నోటీసు నిమిత్తం తేది: 22.10.2025 కి వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గం. 10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ మీ లాయర్ గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేని యెడల అప్పిలెంటు మీ పరోక్షంగా తీర్మానించుదురు అని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
నాగిశెట్టి మోహన్ దాస్,
మామిడాల మనోహర్,
అడ్వకేట్స్, ఒంగోలు.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు
ఓ.యస్.నెం. 228/2023

బిట్వీన్ :
గుర్రం వెంకటరెడ్డి ...వాది
మరియు
1) మోరా వాణి
2) మోరా తరుణ్‌రెడ్డి
3) మోరా సందీప్‌రెడ్డి .... ప్రతివాదులు

టు,
డి3) మోరా సందీప్‌రెడ్డి, తండ్రి : చంద్రశేఖర్‌రెడ్డి (లేటు) వయస్సు 25 సం॥లు, నివాసం : ప్లాట్ నెం. 206, ధర్మక్షేత్రి అపార్ట్‌మెంట్, పిడుగురాళ్ళ టౌన్, మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు దావా వేసివున్నారు. 1 మరియు 2వ ప్రతివాదులు కోర్టు వారి నుండి సమన్లు తీసుకొనివున్నారు. 3వ ప్రతివాది అయిన మీరు పలుమార్లు కోర్టువారు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. గాన, శ్రీయుత కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఆర్డరు వేసి వున్నారు. కావున మీరు ది. 06-10-2025న ఉదయం 10-30 గం. లకు స్వయంగా గానీ, లేక ప్లీడరు ద్వారా గానీ పై కోర్టువారి ముందు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు. లేనియెడల పై దావాను మీ పరోక్షంగా తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

వాయిదాతేది : 06-10-2025
తేది: 30-9-2025
పిడుగురాళ్ళ.

ఎ.సీతారామయ్య,
వాది తరపు న్యాయవాది, పిడుగురాళ్ళ.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
I.A.No. 34 / 2025
O.S.No. 14 / 2017

బత్తుల తిరుపతయ్య, (Died)
వగైరాలు - పిటిషనర్లు / వాదులు
Vs
కల్లు రోశిరెడ్డి
వగైరాలు - రెస్పాండెంట్లు / ప్రతివాదులు

నోటీసు

17. కోటి ప్రసన్నలక్ష్మి, భర్త నరసింహారెడ్డి,
ఇంటి నెంబరు 2-87, పాతూరు, పెదకాకాని గ్రామం & పోస్టు, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా.
18. రాయ మల్లేశ్వరి, భర్త చెంచిరెడ్డి,
ఇంటి నెంబరు 4-58, యస్.టి. బజారు, నకరికల్లు గ్రామం మరియు మండలం, గుంటూరు జిల్లా.
19. మారంరెడ్డి సావిత్రి, భర్త లేట్ గురవారెడ్డి, 4వ లైను, ఆర్.టి.సి. కాలనీ, గుంటూరు పట్టణం మరియు జిల్లా.
20. కీసరి రమణ, భర్త నాగిరెడ్డి, 5వ లైను, ఇంటి నెంబరు 15-14-144/5, ఆర్.టి.సి. కాలనీ, గుంటూరు పట్టణం మరియు జిల్లా.
21. మండలపు వెంకట లక్ష్మమ్మ, భర్త అల్లూరయ్య,
బరంపేట, ముత్తయ్యతోట, సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట పట్టణం, పల్నాడు జిల్లా, (పాత గుంటూరు జిల్లా.)

పై నెంబరు దావాలో I.A.No.34/2025 నెంబరు పిటిషన్ ద్వారా మిమ్ములను ప్రతివాదులుగా చేర్చమని కోరుతూ దాఖలు చేయబడిన పిటిషన్ నందు మీ యొక్క నోటీసు నిమిత్తం శ్రీయుత కోర్టువారు **తే16-10-2025**దినకు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు అనగా **తే16-10-2025ది ఉదయం గం॥ 10.30 నిముషములకు** పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: **16-10-2025**

కోర్టువారి ఉత్తర్వుల మేరకు

కందుకూరు
30-09-2025

యం.మల్లికార్జునరావు
బి.కాం., బి.యల్.,
పిటిషనర్లు తరపు న్యాయవాది

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : అర్జీలు రీ-ఓపెన్ కాకుండా చూడాలని, అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారం ఉండాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశించారు. నరసరావుపేట కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 125 అర్జీలను కలెక్టర్‌తోపాటు జెసి సూరజ్ ధనుంజయ్, డిఆర్ఒ మురళి స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో జాప్యం చేయెుద్దన్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు సంబంధిత శాఖకు పంపాలని సూచించారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరణ

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా పలు వర్గాల ప్రజలకు చేకూరుతున్న లబ్ధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

మానసిక ఒత్తిడితో రోగాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఆరోగ్యకరమైన జీవనం కోసం మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాఇట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా హృదయ సంబంధిత వ్యాధులతో ప్రతి ఏటా 17 మిలియన్ మంది ప్రజలు మృత్యువాత పడుతున్నారని, ఇది మొత్తం మరణాలతో పోల్చి చూస్తే 32 శాతమని తెలిపారు. వీటి నివారణకు ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, ధూమ, మధ్యపానం మానుకుని మానసిక ఒత్తిడి లేకుండా జీవనం సాగించడం మార్గమని చెప్పారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ శాఖమూరి బాజిబాబు, డాక్టర్ చింతగుంట శిరీష అజయ్, డాక్టర్ కె.గౌతం, రెడ్‌క్రాస్ ప్రతినిధులు మెదరమెట్ల రామశేషగిరిరావు పాల్గొన్నారు.

ఊటుకూరు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - క్రోసూరు : మండలంలోని ఊటుకూరు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి సోమవారం విన్నవించారు. గ్రామంలోని సిపిడబ్ల్యూఎస్ స్కీం ద్వారా 9, 10 వార్డుల్లోకి వచ్చే పైపులైనుకు నీరు సరఫరా కావడం లేదన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా చేయడం వల్ల ఇంటింటికీ కుళాయి పనులు నిలిచాయని చెప్పారు. పైపులైన్ల కోసం సిమెంట్ రోడ్డు పగలగొట్టకుండా జింకు పైపులు వేయాలని కోరారు. ఈ వినతిపత్రం ఇచ్చినవారిలో జి.మహేష్, జె.నాగభూషణం, జి.రత్నబాబు ఉన్నారు.

తెలుగు సాహిత్యంలో నిప్పుకణిక జాషువా

జయంతుత్సవ సభలో ప్రొఫెసర్ ఖాసిం

పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న జీవీ ఆంజనేయులు, ఇతర అతిథులు

ప్రజాశక్తి - వినుకొండ

గుర్రం జాషువా 130వ జయంతి ఉత్సవాలు వినుకొండలోని జాషువా కళాప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జాషువా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చిలకల జాన్‌సుందరరావు అధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసిం మాట్లాడారు. ఆకులో ఆకునై.. కొమ్మలో కొమ్మనై అంటూ ప్రకృతి మీద, మరోవైపు ప్రేయసి మీద, ఆమె మునివేళ్ల మీద కవిత్వం నడిచిందని, పురాణాల పైన, దేవుళ్ల పైన, సనాతనమే సమాజ హితంగా కవిత్వం నడుస్తుండగా మరోవైపు కమ్యూనిస్టు భావాజాలం గల అభ్యుదయ కవిత్వం, వచన కవిత్వం నడుస్తున్న సమయంలో వినుకొండలో పుట్టిన గుర్రం జాషువా అంటరానితనాన్ని, పేదరికాన్ని తన గురువుగా ఎంచుకున్నారని చెప్పారు. సంస్కృతం నేర్చుకుని గబ్బిలాన్ని కథా వస్తువుగా పండితుల మధ్య ప్రవేశపెట్టి సఫలీకృతం అయ్యారని చెప్పారు. సమాజంలోని అసమానతలను ఎత్తుచూపుతూ తెలుగు సాహిత్యంలో నిప్పు కణికలాగా జాషువా ఉద్భవించాడని చెప్పారు. ముసలవాడైన బ్రహ్మకు పుట్టినారట నలుగురు కుమారులు.. మరి పంచమ జాతి పుట్టుటకు మూలమేమిటి? అని జాషువా ప్రశ్నిస్తే ఇప్పటికీ సమాధానం చెప్పిన వారు లేరన్నారు. దూరంగా నెట్టివేస్తే 'వాని రెక్కలు కష్టంబు లేనినాడు సస్యరము పండుటాకు సుశీరంబు చివరికి గుడిలోని దేవుడికి నైవేద్యం కూడా కరువైనద'ని జాషువా చమత్కారాన్ని వివరించారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండలో డిజిటల్ లైబ్రరీ, అంబేద్కర్ భవన్‌ను త్వరలో నిర్మిస్తామని హామీనిచ్చారు. జిడిసిసి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ జాషువా అందరివాడన్నారు. మా తాత... ఇక్కడి పల్లెలు, వాతావరణం గురించి ఉమ్మడి ఆంధ్ర శాసనసభలో తనను పలకరిస్తుంటే ఎంతో ఉద్వేగభరితంగా ఉండేదని చెప్పారు. అనంతరం కవులను సత్కరించారు. అరసం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అయిన పెనుగొండ లక్ష్మీనారాయణ, రంగస్థల కళాకారుడు నల్ల వెంకటేశ్వరరావు, షకీలా, జాషువా సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, సిహెచ్ మూర్తి, న్యాయవాది విజయ్, జి.కమలారాం, భాగవతుల రవికుమార్, టీచర్ ప్రదీప్, పిడుగు విజయ్‌దేవ, లగడపాటి వెంకట్రావు, సిపిఎం నాయకులు హనుమంతరెడ్డి, బొంకూరు వెంకటేశ్వర్లు, కేజే రమేష్, శ్యామ్ లింకన్, పి.దాసు పీవీ సురేష్, న్యాయవాదులు ఎన్.రామకోటేశ్వరరావు, సిద్దయ్య, సీనియర్ న్యాయవాది పీజీ లూకా పాల్గొన్నారు.

మా గ్రామాలకు యూరియా సరిగా రావడం లేదు

మండల పరిషత్ సమావేశంలో ప్రశ్నించిన ఎంపిటిసిలు

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని కొన్ని గ్రామాల్లో యూరియా సరిగా సరఫరా అవ్వక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ఎంపిటిసిలు అసహనం వెలిబుచ్చారు. ఎంపిపి పి.కోటయ్య అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించగా గుడిపాడు, నాగవరం ఎంపిటిసిలు మాట్లాడుతూ తమ గ్రామాల్లో ఇంతవరకు యూరియా పంపిణీ కాలేదని ధ్వజమెత్తారు. నాగవరం వ్యవసాయ శాఖ ఉద్యోగి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని అన్నారు. మండల వ్యవసాయాధికారి వి.వేణుగోపాల్ సమాధానమిస్తూ మండలంలో యూరియా కొరత లేదని, గ్రామాల్లో విడతల వారీగా పంపిణీ చేసుకుంటూ వస్తున్నామని చెప్పారు. గుడిపాడు, నాగవరం గ్రామాల్లో వెంటనే పంపిణీ చేస్తామన్నారు. నాగవరం వ్యవసాయ ఉద్యోగిని ఇప్పటికే హెచ్చరించామని, తీరు మారకుంటే ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. నాగవరం శ్మశాన వాటికలో బోరు పాడైందని సభ్యులు చెప్పగా బాగు చేయిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు. ఎంపిడిఒ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలని, డ్రెయినేజీ వ్యవస్థపై శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలపై వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. జిఎస్‌టి తగ్గింపులపై సత్తెనపల్లి కమర్షియల్ ట్యాక్స్ అధికారి చంద్రకాంత్ వివరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి షేక్ జమీల, వైస్ ఎంపిపి వి.వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

జాషువా, భగత్‌సింగ్‌కు నివాళులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని రెంటపాళ్లలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి సభను సోమవారం నిర్వహించారు. చిత్రపటాలకు ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా అధ్యక్షులు దుగ్గి నాగేశ్వరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు జె.సాయికుమార్ పూలమాలలేసి నివాళులర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు జె.అనూష, ఎస్ఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ అమూల్య మాట్లాడారు. రామారావు, డి.మేరమ్మ, పెదతాతారావు, సుజాత, సౌజన్య, అనీల్, చంద్రిక, ప్రశాంతి, నాగేశ్వరావు పాల్గొన్నారు.

వేధింపులు, దూషణలపై మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నరసరావుపేట

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికులపై స్కీం వర్కర్లపై వేధింపులు ఎక్కువయ్యాయని, అనంతపురంలో యూనియన్ నాయకుడు గౌరీశంకర్‌పై అధికారులు అక్రమ కేసు బనాయించి విధుల నుండి తొలగించాలనుకోవడం ఇందుకు నిదర్శనమని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ విమర్శించారు. నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికురాలిపై దాడిచేసి దుర్భాషలాడిన జనసేన కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ మున్సిపల్ కార్మికులు రాజకీయ వేధింపులు, బెదిరింపులకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విధానానికి స్వస్థి పలకాలని డిమాండ్ చేశారు. పెరిగిన మున్సిపాలిటీ పరిధి, జనాభా ప్రాతిపదికిన కార్మికులను పెంచకపోవడంతో కార్మికులపై పని భారం ఎక్కువవుతోందని ఆవేదన వెలిబుచ్చారు. కార్మికుల వేతనాల నుండి పిఎఫ్, ఇఎస్ఐ మినహాయిస్తున్నా పిఎఫ్, ఇఎస్ఐ కార్మికులకు దక్కడం లేదని, ఈ సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు సోమశేఖర్, సామ్రాజ్యం, ఖాసీం, నాగయ్య, కోటేశ్వరరావు, వెంకట్రావు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

గుంటూరు కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికురాలిని దూషించిన కార్పొరేటర్ సుంకరి శ్రీనుపై చర్యలు తీసుకోవాలని సిటియు, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. కె.రమణ, డి.రమణ, సాగర్ బాబు, కొండలు, ఎం.కన్నయ్య, అన్నమ్మ, వి.శివ, పి.కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గుంటూరు నగరంలో మున్సిపల్ కార్మికురాలు పద్మపై జనసేన పార్టీ కార్పొరేటర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బంగ్లా సెంటర్ నుండి అంబేద్కర్ బొమ్మ వరకు ర్యాలీ చేసి నిరసన ప్రదర్శన చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న గౌరీ శంకర్ అనే కార్మికుడుపై అధికారులు అక్రమ కేసులు పెట్టి ఉద్యోగ నుండి తొలగించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. పట్టణాలు, నగరాలను శుభ్రం చేసి ప్రజలకు సేవ చేసే కార్మికులను గౌరవంగా చూడాల్సింది పోయి

అవమానించడం, అనుచితంగా మాట్లాడ్డం సరికాదన్నారు. స్వచ్ఛభారత్ పేరుతో గొప్పలు చెప్పే ప్రభుత్వాలు, అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు మేరీ గ్రేస్, అరుణ, అన్నమ్మ, మేరీ ప్రసన్న, మరియమ్మ, నాగలక్ష్మి, పరమేశు, నరసింహారావు, సురేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు చంద్రకళ, సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్ మాఇట్లాడారు. పెదవెంకయ్య, స్వామి, రాజు, లచ్చమ్మ, డేవిడ్ రాజు, జాన్ పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ప్రవాహం

నీటి మునిగిన పంటలు

పోటెత్తిన వరద.. నీట మునిగిన పంట

ప్రజాశక్తి - కొల్లిపర

కృష్ణానదికి వరద పోటెత్తడంతో కొల్లిపర మండలంలో వేలాది ఎకరాల్లో పంటలు నీటి మునిగాయి. ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు ఆరు లక్షల 80 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేయగా కొల్లిపర గ్రామం వద్ద కట్టకు గండ్లు పడి వాణిజ్య పంటలైన మినుము, అరటి కంద పసుపు కూరగాయ పంటలు నీట మునిగి రైతులకు శాపంగా మారాయి. నిన్న మొన్నటి వరకు తక్కువగా వచ్చిన వరద నీరు ఒకసారిగా పోటెత్తడంతో కృష్ణకరకట్ట వెంబడి ఉన్న పంట పొలాల రైతులు గ్రామ ప్రజలు భయాందోళనలు నెలకొన్నాయి. మండల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇప్పటికే సుమారు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టామని చేతికి వచ్చిన పంట వరద రూపంలో పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు పచ్చగా ఉన్న పంట పొలాలు వరద నీటిలో మునిగి పాడైపోయే పరిస్థితి నెలకొందని, నదికి వచ్చిన వరద తమను అప్పుల ఊబిలో నెట్టిందని రైతులు వాపోతున్నారు. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కొత్తూరు లంక బొమ్మ వారి పాలెం అన్నవరపు లంక గ్రామాల్లోని వృద్ధులు గర్భిణీలు, చిన్నారులు, బాలింత స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో కరకట్టపై నిరంతర గస్తీ ఏర్పాటు చేశారు మండలంలోని హనుమాన్ పాలెం తూములరు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కృష్ణానది ఉగ్రరూపం

ప్రజాశక్తి-తాడేపల్లి

నాగార్జునసాగర్, పులిచింతల నుండి వరద నీరు వచ్చి చేరడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది ఉగ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ వద్దకు 6 లక్షల 86 వేల 74 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుంది. బ్యారేజీ కున్న 70 గేట్లను నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణ పశ్చిమ డెల్టా, తూర్పు డెల్టా, బందరు, ఏలూరు, రై విష్ కాలువలకు 13 వేల 531 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. రెండు ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

కృష్ణా నదికి కొనసాగుతున్న వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో పంట పొలాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది దీనితో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూమి లోపల పంటలేనా పసుపు కంద చీమ దుంపలు ఎక్కువ రోజులు నీటిలో మునిగి ఉన్నట్లయితే దుంప కుళ్ళిపోయే పరిస్థితి ప్రస్తుతం లంక ప్రాంతంలో అధికంగా ఉన్న మినప పైరు నీటిలో మునిగి ఉన్నది వరద ప్రవాహం తగ్గినప్పటికీ మినప పేరు కుళ్లిపోతుందని రైతులు తెలిపారు. ఇతర వాణిజ్య పంటలైన అరటి కూరగాయలు పూల తోటలు కూడా కొన్ని ప్రాంతాల్లో మునిగి ఉన్నాయి. ప్రకాశం బ్యారేజ్ వద్ద రెండో నంబరు ప్రమాద హెచ్చరిక కూడా జారీ

వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహాశీల్దార్

చేయడంతో వరద ప్రవాహం ఇంకా పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో దాదాపు 1200 ఎకరాల వరకు లంక భూములు ఉన్నట్లు అంచనా వీటిలో రకరకాల వాణిజ్య పంటలు సాగు చేయబడుతున్నవి. మరోపక్క అధికార యంత్ర కరకట్ట వెంబడి పరిస్థితిని గమనిస్తున్నారు. స్థానిక తహశీల్దార్ ఐ.సునీత సోమవారం వరద ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు స్థలం ఇవ్వాలి

3నుండి పాదయాత్రలు

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

యువ గళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం మంగళగిరి నియోజకవర్గంలో 20వేల మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం మంజూరు చేసి, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఆదివారం రాత్రి సిపిఎం ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశం సిపిఎం మండల నాయకులు నాగ పోగు విజయరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్న ఇప్పటికీ ఇళ్ల స్థలం లేని లబ్ధిదారులు ఇంటి స్థలం కోసం, ఇల్లు నిర్మించుకునేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నారా లోకేష్ యువ గళం పాదయాత్రతో తాడేపల్లి పట్టణ ప్రాంతంలో పాదయాత్ర చేస్తూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయి అని ఆయన ప్రశ్నించారు. పేద, మధ్య

తాడేపల్లి, మంగళగిరిలలో జరిగిన సమావేశాల్లో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కార్యవర్గ సభ్యులు ఈమని అప్పారావు

తరగతి, సామాన్య ప్రజలు సొంతగా ఇంటి స్థలం లేక, అద్దెలు కట్టుకోలేక పెరిగిన ధరలతో సతమతమవుతున్నారని అన్నారు. అక్టోబర్ 3వ తేదీ నుండి ఇంటి స్థలం, ఇళ్ల పట్టాల మంజూరు కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పాద యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రంగారావు, నల్లపు కిషోర్ బాబు, కొండపల్లి యశోద తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నియోజకవర్గంలో చిన్నకాకాని గ్రామంలో అర్హులైన ఇల్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అలాగే చెరువు పోరంబోకు భూములలో ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు సోమవారం చినకాకాని గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు కాజ శివ శంకర్రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజక వర్గంలో ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ఎన్నికలకు ముందు లోకేష్ హామీ ఇచ్చారని, ఎన్నికల అనంతరం ఆ ఊసే ఎత్తటం లేదని విమర్శించారు. గ్రామం విస్తరించిందని అనేక అపార్ట్ మెంట్లు వచ్చాయని, పెద్దపెద్ద ఎన్నారై లాంటి సంస్థలు కూడా ఉన్నాయని , గ్రామంలో ఉన్న మంచినీళ్ల ట్యాంకు సరిపోవటం లేదని, అందువల్ల గ్రామ అవసరాలన్నీ తీర్చేటట్లుగా మరొక మంచి నీళ్ల ట్యాంకును నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీని తోటి దోమలు విపరీతంగా పెరిగి విష జ్వరాలు సోకుతున్నాయని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీ నుండి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేసి 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే రిలే దీక్షలను, 17వ తేదీన జరిగే నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమాలను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఎం పార్టీ మంగళగిరి రూరల్ మండల కమిటీ సభ్యులు జి .బాబు వరప్రసాద్ ,ఒకటవ శాఖ సహాయ కార్యదర్శి టి. బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

హౌసింగ్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక హౌసింగ్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ చంద్రమోహన్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలో సమస్యలు అనేకం ఉన్నాయని, పాత లాక్కునుండి కొత్త లోక వరకు రోడ్డు పగలగొట్టి తిరిగి నిర్మించలేదని అన్నారు. ఆ మార్గంలో హౌసింగ్ కాలనీలోకి, రావాలంటే చీకట్లో విషసర్పాలు సంచరిస్తున్నాయని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జెట్టి బాలరాజు మాట్లాడుతూ కాలనీలో వాటర్ ట్యాపులు బిగించారు గానీ ట్యాంకు నిర్మించలేదన్నారు. మంచినీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అధికారులు ప్రభుత్వం స్పందించకుంటే కాలనీవాసులను సన్నద్ధం చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వై.ఏసోబు, శ్రీనివాసరావు, ఎస్.కె.గౌసియాబీ, కె.లక్ష్మీభవాని, వి.శ్రీలక్ష్మి, వి.శివపార్వతి, నాగూర్‌బి పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో కృష్ణానది వరద నీరు వల్ల నీట మునిగిన పంట పొలాల రైతులను ఆదుకోవాలని వైఎస్ఆర్‌సిపి మంగళగిరి నియోజకవర్గం సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కోరారు. సోమవారం లంక గ్రామాల్లో ఆయన పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ కృష్ణా నదికి వచ్చిన భారీ వరద నీరు వల్ల చిర్రావూరు గ్రామంలో లంక పొలాలలో సుమారు 400 ఎకరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. మినుము, అరటి, కంద వంటి వాణిజ్య పంటలు ఈప్రాంతంలో ఉన్నాయని, తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి, రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వైఎస్ఆర్‌సిపి ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ పార్టీ నాయకులు కాసినేడి బాజీ, గంగాధరరావు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

ప్రజాశక్తి - పెదకాకాని

దసరా ఉత్సవాలలో భాగంగా స్థానిక మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం భ్రమరాంబ అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులు దర్శన మిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు దర్శనం, అన్న ప్రసాదం, త్రాగునీరు, పారిశుద్ధ్యం లాంటి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్, సిబ్బంది, అర్చకులు దగ్గరుండి పర్యవేక్షించారు.

సమావేశం వాయిదా

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ అధ్యక్షతన సోమవారం స్థానిక పురపాలక సంఘ సమావేశ మందిరంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశంలో కౌన్సిల్ సుభాని మాట్లాడుతూ అజెండాలోని అంశాలు శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుందామని, అప్పటి వరకు సమావేశం వాయిదా వేయాలని కోరారు. స్పందించిన చైర్మన్ కౌన్సిలర్ల అభ్యర్థన మేరకు చర్చించి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కమిషనర్ వేణుబాబు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బాలబాలికలకు అక్షరాభ్యాసం, అన్నదానం

ప్రజాశక్తి - మాచర్ల

న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం బాలబాలికలకు అక్షరాభ్యాసం చేయించారు. దసరా నవరాత్రులలో భాగంగా శ్రీ సరస్వతి దేవి పూజా కార్యక్రమాని పురస్కరించుకొని పట్టణంలోని మాతా అన్నపూర్ణేశ్వరిదేవి ఆలయం, శ్రీ సాయిబాబా ఆలయాల్లో శ్రీనివాసరెడ్డి దంపతులు పూజలు నిర్వహించి, 500 మంది బాల బాలికలకు అక్షరా భ్యాసం చేయించారు. నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. అనంతరం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాల బాలికలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేశారు.

అక్షరాభ్యాసం చేయిస్తున్న జున్నా దంపతులు

పోస్టరు ఆవిష్కరిస్తున్న తహశీల్దారు, సిబ్బంది

తహశీల్దారుచే జీఎస్టీ పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ప్రధాన సంస్కరణల్లో భాగంగా జీఎస్టీఅనేక వస్తువులు పై తగ్గించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. సోమవారం వినియోగదారుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు వారు రూపొందించిన జీఎస్టీ పోస్టరును తహశీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంఘం ప్రజలలో జీఎస్టీ తగ్గింపు సందేశాన్ని పోస్టర్ల ద్వారా వాణిజ్య కూడళ్లలో ప్రచారం చేసినట్లు తెలిపారు. వినియోగదారులు తగ్గిన జీఎస్టీని పరిగణనలోకి తీసుకొని వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా జీఎస్టి కాలిక్యులేటర్ వస్తుందన్నారు. ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్, రవి నాయక్, విక్రమ్, విద్యాసాగర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం : యాగంటి

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన ప్రకారం విద్యుత్ ఛార్జీలు తగ్గింపు నిర్ణయాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకుందని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. తక్కువ రేటుకే విద్యుత్ కొనుగోలు చేయడం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉన్న పరిపాలన అనుభవంతో విద్యుత్ శాఖని గాడిని పెట్టడంతో దాదాపు రూ.1,000 కోట్లు ఆదా అయిందన్నారు. ఈ మొత్తం నవంబర్ నుంచి వినియోగదారులకు ప్రతి యూనిట్‌పై 13పైసలు తగ్గిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల తలసరి ఆదాయం మెరుగుపడుతుందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలో పర్యటించి పలు కిరాణా, మెడికల్, ఎలక్ట్రానిక్ పలు దుకాణాలను సందర్శించి వ్యాపారస్తులు, వినియోగదారులతో కొమ్మలపాటి మాట్లాడి జీఎస్టీ తగ్గింపుపై వారి అభిప్రాయ లను అడిగి తెలుసుకున్నారు. కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో విప్లవాత్మమైన మార్పులతో ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చి జీఎస్టీని తగ్గించారని, దీని వలన సామాన్యులకు ఆర్థిక ప్రయోజనంతో పాటు పొదుపు పెరుగుతుందని చెప్పారు. టిడిపి నాయకులు నాగేశ్వర రావు. రామకోటేశ్వర రావు. రామమోహన్‌రావు. శ్రీనివాసరావు. కరిముల్లా. మస్తాన్‌వలి. శ్రీనివాసరావు. భుజంగరావు. లోకేశ్వరరావు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల. నాయకులు కార్యకర్తలు. కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజాశక్తి - కారంపూడి

దసరా పండుగ సందర్భంగా ఎన్డీఏ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజలకు తాము ఉపయోగించే నిత్యావసర సరుకులు, కొన్ని వస్తువులు, వాహనాలు బట్టి 5శాతం, 12 శాతం జీఎస్టీని ప్రవేశ పెట్టడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు వారు పన్నులు ఎలా తగ్గాయో మండలంలోని గ్రామ కార్యదర్శులు, అధికారులు గ్రామ ప్రజలకు సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. జీఎస్టీ పన్నులపై అవగాహన లేని వారిని వ్యాపారస్తులు దోచుకోవటం వారి నైజం. ఏవైనా సరుకులకు రేట్లు పెరగగానే దానికి రెండు రెట్లు పెంచుకునే వ్యాపారస్తులు రేట్లు తగ్గినప్పుడు మాత్రం తగ్గించకుండా తమ దోపిడిని కొనసాగిస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ రాయితీని వ్యాపారస్తులు ఎంత వరకు పన్నులను తగ్గించి ప్రజలను దోచుకోరో వేచి చూడాలి.

ఏ వార్డు సచివాలయం ఆ వార్డులోనే ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి 21వ వార్డుకు సంబంధించిన సచివాలయం ఆ వార్డు ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ చలంచర్ల లక్ష్మీ తులసి సాంబ శివరావుకు ఆ వార్డు ప్రజలు వినతిపత్రం అందజేశారు. విమల మాట్లాడుతూ సత్తెన పల్లి పట్టణంలో 21వ వార్డుకు సంబంధించిన సచివాలయం నరసరావుపేట రోడ్డులోని వెంకటపతి కాలనీలో దూరంగా ఉండటం వలన, ప్రజలు, వృద్ధులు, మహిళలు, వికలాంగులు, 23వ వార్డు వెంకటపతి కాలనీ వాసులకు సంబంధించిన సచివాలయం మున్సిపల్ ఆఫీసు వెనకవైపు కమ్యూనిటీ హాలులో

లక్ష్మీ తులసికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ఉన్నందున వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై సిపిఎం పలుమార్లు, మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిందన్నారు. ఏ వార్డుకు సంబంధించిన సచివాలయం అవార్డ్ పరిధిలోనే ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సిపిఎం సీనియర్ నాయకులు ఎ.ప్రసాద్ రావు వై శ్రీనివాసరావు సిపిఎం రూరల్ కార్యదర్శి పెండ్యాల మహేష్, హరి పోతురాజు. జడరాజ్ కుమార్. ఎ సుంద రయ్య, దామర్ల వెంకటేశ్వర్లు, వార్డు ప్రజానీకం పాల్గొన్నారు.

జాతీయ ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపికైన క్యాడెట్స్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు ఎన్‌సిసి గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జరుగనున్న జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్యాంపునకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సిసి క్యాడెట్లు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం కళాశాల చైర్మన్ వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జి.రమ్యశ్రీ, జి.హారిక, సిహెచ్.హంసిక రెడ్డి జాతీయ స్థాయిలో ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ శిక్షణ భవిష్యత్తులో వారికి ఎంతగానో దోహద పడుతుం దన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సిసి అధికారి రాజేష్‌బాబు

కళాశాల వైస్ చైర్మన్ ఎం.చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ రాజేష్‌బాబు, విభాగాధిపతులు డాక్టర్ తిరుమల రావు, డాక్టర్ వివిఎస్ లక్ష్మీ క్యాడెట్స్‌ను అభినందించారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కారంపూడి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన కారంపూడిలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ డిజిటల్ బుక్ ను పల్నాడు జిల్లా వైసీపీ ఎస్సి సెల్ అధ్యక్షులు కొమ్ము. చంద్రశేఖర్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామావత్ జాన్‌పాల్‌నాయక్, యువజన విభాగం మండల అధ్యక్షులు చిలుకూరి. చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు బొమ్మిన. అల్లయ్య, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్. అబ్దుల్ ఆరిఫ్, మేధావుల సంఘం మండల అధ్యక్షులు బి.నాగరాజు, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి కొమెర అంకారావు ఆవిష్కరించారు. వైఎస్ఆర్సీపీ ఐటి విభాగం మండల అధ్యక్షులు బంకా. ఏజ్రా, వైసిపి సీనియర్ నాయకులు సురే. వెంకటే శ్వర్లు, వైసీపీ మండల కార్యదర్శి దొంత. అంజి, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్ని, ప్రభు కిషోర్, చింతపల్లి ఎంపిటీసీ అచ్యుతరావు, గోగుల. ప్రసాద్, లంజేపల్లి. సంపూర్ణ, భట్లువారిపల్లి సర్పంచ్ ఏరువ. కాసయ్య, బత్తుల. చిన్న అంజి, చిన్నోడు పాల్గొన్నారు.

వడ్డెరుల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - మాచర్ల

వడ్డెరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెరా దుర్గారావు అన్నారు. విజయవాడలోని బీసీ సంక్షేమ భవనంలోవడ్డెర సంక్షేమ సంఘం డైరెక్టర్ బాధ్యతలను ఆయన సోమవారం స్వీకరించారు. దుర్గారావు మాట్లాడుతూ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 35మందికి మంజూరైన రూ.21,91,69 లక్షల చెక్కులను సత్తెనపల్లి ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులుకొమ్మాలపాటి శ్రీధర్ బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దరువూరి నాగేశ్వరావు,పూజల వెంకట కోటయ్య కూటమి నాయకులు పాల్గొన్నారు.

నల్లబార్లీ పొగాకు సాగు చేయొద్దు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మండల పరిధిలోని రైతులెవ్వరూ నల్లబార్లీ పొగాకు పంటను సాగు చేయద్దని మండల వ్యవయాధికారిణి డి. పాపకుమారి కోరారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలోఎన్‌ఫోర్స్‌మెంట్ టీం (వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్) ఆధ్వర్యంలో నల్లబార్లీ పొగాకు రకాల సాగు నివారణకు రైతులతో సమావేశం నిర్వహించారు. పాప కుమారి మాట్లాడుతూ నల్లబార్లీ పొగాకు పంటను ఎవరూ సాగు చేయవద్దని, తెల్ల బార్లీ పొగాకును బాండ్ ఉంటేనే సాగు చేయాలని తెలిపారు. పొగాకు ప్రత్యామ్నాయంగా పొగాకు బదులు అపరాలు పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్ల గ్రామంలో సోమవారం స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్ జరిగింది. అందులో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులు చివరంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకూరపాడు మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ మండల అధ్యక్షులు బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, పాటిబండ్ల శివమ్మ, టిడిపి సీనియర్ నాయకులు మద్దినేని వెంకట సత్యనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు గళ్ళ శివనాగరాజు, గ్రామ టిడిపి నాయకులు పాటిబండ్ల యోహాను, ఎస్ కే మాబు, నీసు రమేష్, గుమ్మడి పుష్పలత, సయ్యద్ సుభాని, షేక్ కరిముల్లా, ఎస్ కే షంషేర్, పాటిబండ్ల శివ ప్రసాద్ , నూతక్కి బాల, గాదె ఈన్నారెడ్డి, ముత్యాల బాలస్వామి, పాటిబండ్ల రాయప్ప, పాటిబండ్ల రత్తయ్య, పాటిబండ్ల రాజారత్నం పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ కేశిరెడ్డి వెంకటరెడ్డి

రూ. 25లక్షల వ్యయంతో డొంకరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలో అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం మండలంలో మరొక అభివృద్ధి పనికి శ్రీకారం చుట్టింది. 25 లక్షల వ్యయంతో నిర్మించే గొట్టిపాళ్లకు వెళ్లే డొంకరోడ్డు నిర్మాణానికి ఈరోజు పూజా కార్యక్రమం నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వెల్దుర్తి మాజీ సర్పంచ్ కేశిరెడ్డి వెంకటరెడ్డి, టిడిపి యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, జూలకంటి చిరంజీవిరెడ్డి, కాయితి భాస్కర్ రెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజుపాలెం

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని రాజుపాలెం డిప్యూటీ తహశీల్దార్ షేక్‌బాషా అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గణపవరం గ్రామంలో స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ బాషా మాట్లాడుతూ స్వచ్ఛత అంటే కేవలం శుభ్రం చేయడమే కాదని, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడమని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం స్వచ్ఛతపై గ్రామ ప్రజలందరూ ప్రతిజ్ఞ చేశారు. ఎంఎస్‌వి, విఆర్వో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలు సంతోషంగా ఉన్న చోటే అభివృద్ధి : చీఫ్ విప్ జీవీ

శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా కానుకగా చీరలు పంపిణీ

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

మహిళలు ఎక్కడ సంతోషంగా ఉంటే అక్కడే అభివృద్ధి ఉంటుందని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. సోమవారం వివిరాజుపల్లి సమీపంలోని శివశక్తి ఫౌండేషన్ కార్యాలయం ఆవరణలో విజయదశమి వేడుకలు, సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పట్ల నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దసరా, దీపావళి కానుకగా సుగాలి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టి పేదలు, మహిళలు, రాష్ట్రాభివృదికి అంకితం అయిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు సాధారణ ప్రయాణం నుండి ఉద్యోగ, ఉపాధి అవకాశాల వరకు మేలు జరుగుతోందన్నారు. అనంతరం శివశక్తి ఫౌండేషన్ తరఫున సివిల్స్ శిక్షణ పొందే ఎస్సీ, ఎస్టీ మహిళలకు స్కాలర్‌షిప్‌లు, సేవాలాల్ దేవాలయం నిర్మాణానికి రూ.5లక్షల విరాళం ప్రకటించారు. అదనంగా సేవాలాల్ ఆలయం పక్కనే కమ్యూనిటీ హాల్, వినుకొండ పట్టణంలో తాగునీటి సదుపాయాలు, రూ.3 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, రామలింగేశ్వరస్వామి ఆలయం, ఘాట్ రోడ్, ఎన్ఎస్పీ మైదానంలో అభివృద్ధి పనులు రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులేకే పనుల్లో జాప్యం

కౌన్సిల్‌లో అధికారులపై ఆగ్రహించిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - తెనాలి

పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అధికారులు చేసిన జాప్యమే అభివృద్ధి పనులకు అవరోధంగా మారిందంటూ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం కౌన్సిల్ హాలులో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. అజెండా అంశాలు చదువుతుండగా టిడిపి కౌన్సిలర్లు దేసు ముగంధర్, పసుపులేటి త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం వెనుక అసంపూర్తిగా ఉన్న స్వర్ణ కారుల భవనాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశించి వారం దాటుతున్నా ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కనీసం దాని ఆవరణలోని మురుగు నీరును కూడ తొలగించలేదన్నారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ వారంలోగా పనులు ప్రారంభిస్తామని బదులిచ్చారు. శాంతించని వారు ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్‌కు నాలుగురోజుల్లో బాగు చేస్తామని చెప్పి, పనులు ఎందుకు ప్రారంభించలేదో చెప్పాలని టిడిపి కౌన్సిలర్లు పట్టుబట్టారు. వారం రోజులు ఎందుకు ఆగలేక పోతున్నారని ఇన్‌చార్జి కమిషనర్ అనటంతో మీ వైఖరి కారణంగానే టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రావటం లేదని ఆరోపించారు. ఇంతలో ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొవ్వా యేసుబాబు కలుగజేసుకుని యాక్షన్ ప్లాన్ తయారు చేశామని నాలుగురోజుల్లో ఆవరణంతా శుభ్రం చేస్తామని హామీ ఇవ్వటంతో శాంతించారు. దసరా అనంతరం కౌన్సిలర్స్ సమక్షంలో సమావేశం నిర్వహించాలని సూచించారు. దీనికి చైర్‌పర్సన్ రాధిక అంగీకారం తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

సమస్యలపై ఏకరువు పెట్టిన కౌన్సిలర్లు..

వార్డులో షిల్ట్ తీయటం లేదని కౌన్సిలర్ మొఘల్ ఆహ్మద్ బేగ్, చినరావూరు కమ్యూనిటీ హాల్‌లో వ్యర్థాలు తొలగించాలని, దాని పనులు పూర్తి చేయాలని కౌన్సిలర్ కుర్రా సుజాత కోరారు. 27వ వార్డులో కాల్వకు సైడ్ వాల్స్ నిర్మించాలని కౌన్సిలర్ బోయపాటి అరుణ, కుక్కల సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, రోడ్లు, కాల్వలు, కల్వర్టులు నిర్మించాలని, మంచి నీటి కుళాయి కనెక్షన్‌లు లేకపోయినా బిల్లులు వేస్తున్నారని, వాటిని రద్దు చేయాలని కౌన్సిలర్‌లు షేక్ ఇస్మాయేల్, కొమరబత్తిని జయపాల్, గోగిరెడ్డి మానసరెడ్డి, ఆవుల కోటయ్య, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, తాడిబోయిన బ్రహేశ్వర రావు కోరారు. కంపోస్ట్ యార్డులో వ్యర్థాలు ఎప్పటికి పూర్తిగా తొలగిస్తారంటూ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ప్రశ్నించారు. వచ్చే సమావేశంలో దానికి సంబంధించిన వివరాలతో రావాలని అధికారులను కోరారు. అనంతరం అజెండా అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ధరలు గ్గాయి గమనించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని, అందువలన ధరలు తగ్గాయి, ఏ రేటుకు అమ్ముతున్నారో గమనించాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ముత్యాలరావు సచివాలయ సిబ్బందిని, గ్రామ సమైక్య సభ్యులను కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్న వస్తువులకు బిల్లులు తీసుకుంటే అప్పుడు తప్పనిసరిగా ధరలు తగ్గుతాయని తెలిపారు. ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్, ఈఓపిఆర్‌డి జవహర్‌లాల్ నెహ్రూ, గ్రామ కార్యదర్శి కె.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎల్‌ఓసి చెక్కు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక కొప్పురావు కాలనీ చెందిన బేత వెంకటలక్ష్మికి మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 1,50,000 రూపాయల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) ముంజురైంది. టీడీపీ నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, 19వ వార్డు అధ్యక్షులు చెల్లూరి వీర వెంకట సత్యన్నారాయణ, శివాలయం ట్రస్ట్ బోర్డు మెంబెర్ జంజనం వెంకట సుబ్బారావు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి తిరువీధుల సతీష్, గోలి వెంకటేష్, తాడిపత్రి సురేష్‌కృష్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

చట్టాలపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహశీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని, సమాజంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛా స్వాంత్ర్యం, సమానత్వం, కుల, మత, జాతి,లింగ, విభేదాలు లేకుండా చూడాలన్నారు. ఎస్ఐ జాన్‌ఖాన్ వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏవో రవికుమార్, విఆర్ఓ శ్రీనివాసరావు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కుక్కలు, పందులతో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి- తాడేపల్లి

స్థానిక నులకపేట, డ్రైవర్స్ కాలనీ, రాయల్ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో బజార్లలో విచ్చల విడిగా కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క భారీ వర్షాలు, మరోపక్క సీజన్ జ్వరాలతో బాధపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మరోపక్క పందులు, కుక్కలు విచ్చలవిడిగా తిరగడంతో ఎప్పుడు దాడి చేస్తాయని భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ పయనం సాగిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. మీద బడి రక్కితే ఇంజక్షన్ల కోసం హాస్పిటల్ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైరల్ ఫీవర్ తో పాటు పందులు, కుక్కలు వలన అనారోగ్య బారిన పడే అవకాశం లేకపోలేదు అంటూ స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే పాఠశాల ఉండటం స్కూలుకి వెళ్లి, వచ్చే పిల్లలపై ఎక్కడ దాడి చేస్తాయోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కలు, పందులు గుంపులు గుంపులుగా తిరగటం వలన ఎప్పుడు మీద పడి దాడి చేస్తాయోనని ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు కుక్కలు, పందులను పట్టుకొని ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించ దానికి వీలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నడిరోడ్డుపై కుక్కల హల్‌చల్

అంటు వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నీళ్ల విరేచనాలు, సాధారణ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎండివో కె.రవి బాబు, పంచాయతీ కార్యదర్శి ఎ.కృష్ణకిషోర్‌బాబు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరపున కె.అబ్దుల్ రెహమాన్, హెల్త్ విజిటర్ అన్న మేరీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వఅద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరోధించవచ్చని తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బులియన్ మర్చంట్ వర్తకులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే ధూళిపాళ్ల

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ప్రజాశక్తి - పొన్నూరు

బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులకు తాను అండగా ఉంటానని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. బులియన్ అండ్ జ్యూయలరీ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు షేక్ బాబ్జి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 50 ఏళ్లుగా బులియన్ మర్చంట్ అసోసియేషన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బులియన్ మర్చంట్ వర్తకులు ఎప్పుడు కష్టాల్లో ఉన్నా తాను ఆదుకొనటానికి సిద్ధంగా ఉంటానన్నారు. మాజీ మంత్రివర్యులు దేవినేని ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ పొన్నూరు బులియన్ మర్చంట్ అసోసియేషన్‌కు తాను అండగా ఉంటానన్నారు. రాష్ట్ర బులియన్ జ్యువెలరీ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపిలవాయి విజయకుమార్ మాట్లాడుతూ పొన్నూరు అసోసియేషన్ సభ్యులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరించడంలో వెనుకాడబోనని హామీని ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు సంకా మల్లికార్జునరావు, సెక్రటరీ షేక్ అలీషా, ట్రెజరర్ మహమ్మద్ ఖాసిం మాట్లాడారు. అతిథులను కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు షేక్ బాబు సాహెబ్, వెల్దుర్తి లక్ష్మణమూర్తి, సయ్యద్ ఖాయం, షేక్ మక్బూల్, షేక్ బాబ్జి, సయ్యద్ గౌస్, ఆలపాటి ఓంకారనాథ్, షేక్ సఫయతుల్లా, బులియన్ మర్చంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పలకలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

భావనారుషి దేవస్థానంలో అక్షరభ్యాసం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక నాంచారమ్మ ప్రాంగణంలో శ్రీ భద్రావతి సమేత భావనారుషి దేవస్థానంలో దసరా నవరాత్రులు పురస్కరించుకొని సోమవారం మూలా నక్షత్రం సరస్వతి దేవికి పంచాముత్రాలతో అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. మునగపాటి చస్విక రాజ్ పేరుమీద ఉచిత పలకలు, బలపాలు, పుస్తకాలు, పెన్నులు, పూజ సామాగ్రి అక్షరాభ్యాసాలు చేపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి కుమారులు చిన్నరాజా గాయత్రి, చస్విక రాజ్, ప్రేమ్ కుమార్ తల్లి హైమావతి, చింత కింది కుమార్, సుజాత బిట్రా రేవతి కుటుంబ సభ్యులు, మంగళగిరి పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు, అధ్యక్షులు చింతకింది కనకయ్య, దామర్ల కుబేర స్వామి, గంజి రవీంద్ర, ఆర్.పూర్ణచంద్రరావు, గుత్తికొండ ధనుంజయ రావు, వంగర పెద్ద లక్ష్మయ్య, జొన్నాదుల బిక్షారావ్, బిట్రా భాస్కరరావు, త్రిమూర్తులు, దామర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యేల ధూళిపాళ్లకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక ఈద్గా భూమి కొనుగోలు కోసం 15 లక్షల నిధులు సమకూర్చిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు మైనార్టీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వేజెండ్ల దర్గాలో జరిగిన మైనార్టీ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో టిడిపి మండల గ్రామ పార్టీ నాయకులు మాట్లాడారు. ఈద్గా భూమి కొనుగోలు నిధులను ముస్లిం మత పెద్దలకు అందించారు. ఎన్నికల హామీ మరువకుండా ఈద్గా స్థలం కొనుగోలుకు ప్రత్యేక శ్రద్ధతో నిధులను సమకూర్చి ముస్లిముల పట్ల తన చిత్తశుద్దిని చాటిన ఎమ్మెల్యే ధూళిపాళ్లకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మండల టీడీపీ నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిస్టర్ విద్య

10 గ్రామాల్లో బాలల పార్లమెంట్

ప్రజాశక్తి - తాడేపల్లి

మండలంలోని 10 గ్రామాల్లో బాలల పార్లమెంట్‌లు ఏర్పాటు చేసి, బాలల హక్కుల గురించి, బాల్య వివాహాల నిర్మూలన గురించి, బాలికలపై జరిగే లైంగిక దాడులు గురించి, లింగ వివక్షత గురించి, చైతన్యవంతం చేయనున్నట్లు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిస్టర్ విద్య తెలిపారు. సోమవారం తాడేపల్లి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల బాలికలు రక్షణ, వారి అభివృద్ధికి తాము చేస్తున్న ఈ పనిలో సహాయ సహకారం అందించే మీడియా వారి సేవలను కొనియాడారు. ఉచిత హెల్ప్ లైన్ నంబర్ల గురించి చైతన్యం కల్పిస్తున్నామన్నారు. పి.అనిల్ కుమార్,, సచివాలయం, మండల ఎడ్యుకేషన్ ఆఫీస్ సిబ్బంది, గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు పి.అనిల్ కుమార్, ఎన్.నాగమణి, జె.ఇశ్రాయేల్, బి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జొమాటో కార్మికులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జొమాటో యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలు వెనక్కి తీసుకోకపోతే నిరవధిక సమ్మె చేపడతామని ఆలిండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం శని, ఆదివారాలు సమ్మె శాంతియుతంగా సమ్మె నిర్వహించారని, ఈ సమ్మె సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు వినతి పత్రం అందజేశామని, ఆ సందర్భంగా వారు యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కంపెనీ ప్రతినిధులు కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే పోరాటం ద్వారా తిప్పి కొడతామని అన్నారు. అవసరమైతే జొమోటో కార్మికులు నిరవధిక సమ్మెకు పూనుకుంటామని అన్నారు. ఆ తర్వాత జరిగే పరిణామాలకు కంపెనీ యాజమాన్యమే బాధ్యత వహించవలసి ఉంటుందని అన్నారు.

ఎంపికైన అభ్యర్థులతో కలెక్టర్

డిఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

బిసి స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ తీసుకొని ఇటీవల మెగా డిఎస్సీలో ఉద్యోగం సాధించిన అభ్యర్థులను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అభినందించారు. బిసి స్టడి సర్కిల్ ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో డిఎస్సీ శిక్షణ అందించినట్లు చెప్పారు. కోచింగ్ పొందిన వారిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ 14 మంది, స్కూల్ అసిస్టెంట్లుగా నలుగురు ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయటంతో పాటు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు పాల్గొన్నారు.

ట్రెక్ క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్లు

ఆర్‌విఆర్ జెసిలో ఎన్‌సిసి ట్రెక్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

అడ్వెంచర్స్ ద్వారా జీవితంలోని అవరోధాలను అధిగమించటానికి కావాల్సిన మేధస్సుతోపాటు, నూతన ఆలోచనలు ఉత్పన్నమవుతాయని ఏపీ ట్రెక్ 3 మేనేజర్ కల్నల్ సుదాన్ష్ దుబే అన్నారు. సోమవారం ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఎన్‌సిసి విద్యార్థులకు ఏపీట్రెక్ క్యాంప్ నిర్వహించారు. కల్నల్ సుదాన్ష్ దుబే ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్‌లోని 9 గ్రూపులకు సంబంధించిన 510 మంది ఎన్.సి.సి విద్యార్థినిలు ఈ ట్రెక్ క్యాంప్‌లో పాల్గొన్నారన్నారు. నేటి ఆధునిక జీవన విధానంలో విద్యార్థులు చిన్నతనం నుండే కంప్యూటర్లు, ఫోన్లో, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అలవాటు పట్టడం ద్వారా శారీరకంగా మానసికంగా ఆలోచించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇటువంటి అడ్వెంచర్స్ ద్వారా జీవితంలో సమస్యలను అవరోధాలను అధిగమించటానికి కావాల్సిన ఆలోచనలు ఉత్పన్నమవుతాయని, విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందని, శారీరకంగా మానసికంగా అభివద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఉదయ్ కుమార్, ఎన్.సి.సి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సర్వీసెస్‌కు గోల్డ్ కేటగిరి అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుకి చెందిన నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ కు వెర్టీస్ అంతర్జాతీయ కంపెనీ గోల్డ్ కేటగిరి అవార్డు ను అందచేసింది. ఏపీ లో నేషనల్ హైవే అథారిటి సంస్థ చెన్నై-కలకొత్తా, విజయవాడ-హైదరాబాద్ మార్గంలో జాతీయ రహదారుల నిర్వహణ, భద్రత అంశాలు, లేన్ ఆపరేషన్స్, మొబైలింగ్ పెట్రోలింగ్ నిర్వహణపై సర్వే చేసి నివేదిక సమర్పించినందుకు అంతర్జాతీయ కంపెనీ "వెర్టీస్" సంస్థ ఇటీవల ముంబై లో అవార్డు ప్రధానం చేసినట్లు మేనేజింగ్ పార్ట్నర్ కాళహస్తి సత్యనారాయణ సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. గోల్డ్ క్యాటగిరి అవార్డు ప్రధానంలో భాగంగా ప్రశంసా పత్రాన్ని షీల్డ్ ను బహుకరించారని చెప్పారు.ఈ సందర్భంగా టోల్ ప్లాజా చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ కిరణ్ బాబు, చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ లు హరి పాండురంగ స్వామి, మాచర్ల రాజ రావు, టోల్ ప్లాజా మేనేజర్లు, నేషనల్ హైవే అథారిటి సిబ్బంది అభినందనలు తెలిపారు. గుంటూరు లో మంగళవారం నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆఫీసు లో సంస్థ సిబ్బంది హెచ్‌ఆర్ మేనేజర్ ఎన్. సత్య సాయి, ఎగ్జిక్యూటివ్ వి. లిడియా, మేనేజర్ జి. ఉమా మహేశ్వర రావు, సెక్యూరిటీ సిబ్బంది మిత్రులు ఘనంగా సత్కరించారు.

అవార్డు షీల్డ్‌తో కాళహస్తి సత్యనారాయణ, ఇతర నిర్వహాకులు

గ్రీవెన్స్‌లో శాఖలకు ప్రత్యేక కౌంటర్లు : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా వివిధ విభాగాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కొన్ని మార్పులు చేశారు. గ్రీవెన్స్ నిర్వహిస్తున్న తీరు, పరిష్కారం చేస్తున్న విధానం, కౌంటర్లను పరిశీలించారు. రెవిన్యూ, జి.ఎస్.డబ్ల్యు.ఎస్, రిజిస్ట్రేషన్, విద్యా, పోలీస్, విద్యుత్ తదితర శాఖలకు సంబంధించిన వినతులు ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించి వాటికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రతి అర్జీ నిశితంగా పరిశీలించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. సోమవారం అందిన అర్జీలు శుక్రవారం నాటికి పూర్తిచేసి డేటాను అప్‌లోడ్ చేయటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశిత సమయానికి ఏ అర్జీ దాటరాదని స్పష్టం చేశారు.అనంతరం గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 222 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, గ్రీవెన్స్ నోడల్ అధికారి గంగారాజు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూసేకరణ పరిహారం పెంచాలి..

గుంటూరు ఛానల్ విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాలని ప్రత్తిపాడు మండలం, కొండేపాడు గ్రామ రైతులు రైతు సంఘం నాయకులతో కలిసి గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో 38 ఎకరాల భూమిని సేకరిస్తున్నారన్నారు. భూముల ధరలు అనేక రెట్లు పెరిగినా రిజిస్ట్రేషన్ విలువ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ విలువ తక్కువగా ఉండటంతో రైతులకు నష్టం వస్తుందన్నారు. గుంటూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండేపాడులో రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలు ఉందని, దీనిపై రెండున్నర రెట్లు ఇస్తామంటున్నారన్నారు. అక్కడ మార్కెట్ వ్యాల్యూ రూ.45 లక్షలు ఉందన్నారు. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం ఇస్తే రూ.25 లక్షలే వస్తుందన్నారు. కావున నాలుగు రెట్లు పెంచి ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో గ్రామ సర్పంచ్ నర్రా రాంబాబు, ఎం.సాంబశివరావు, బి.సాంబశివరావు, సిహెచ్.బాపారావు, రైతు సంఘం నాయకులు ఆదినారాయణ తదితరులున్నారు.

పీకలవాగు సమస్యను పరిష్కరించాలి

పీకలవాగు వల్ల ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక సంగడిగుంటకు చెందిన ప్రజలు గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. చిన్న వర్షం పడినా పీకలవాగు నిండిపోయి, మురుగు నీరు రోడ్లపైకి వస్తుందన్నారు. మోకాలులోతు నీరు నిలిచి మూడు, నాలుగు రోజులు నిల్వ ఉంటుందన్నారు. వర్షం నీటితోపాటు పాములు, విషపురుగులు రోడ్లపైకి, ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పరిష్కారం కాలేదన్నారు. ఫిర్యాదుపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, మూడ్రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో గౌస్, జానీభాషా తదితరులున్నారు.

పానీపూరి బండ్లకు అనుమతిని పునరుద్ధరించాలి

గుంటూరు నగరంలో పానీపూరి బండ్లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని విక్రేతలు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. గత పది రోజుల నుండి పానీపూరి బండ్లు ఆపేశారని, దీంతో తమ కుటుంబాలు గడవటం కష్టంగా ఉందని తెలిపారు. కావున ఇప్పటికైనా తిరిగి ఏర్పాటు చేసుకోవటానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో రాజేష్, అనిల్‌కుమార్, వీరేంద్ర, మనోజ్‌కుమార్ తదితరులున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్, అదనపు కమిషనర్

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : మేయర్ రవీంద్ర

ప్రజాశక్తి-గుంటూరు

గ్రీవెన్స్, డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజలు ఇచ్చే అర్జీలను సకాలంలో, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం జిఎంసి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అధికారులను ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ అర్జీలు శాశ్వత పరిష్కారం ఉండే విధంగా పరిష్కరించా లన్నారు. అధికారులు క్షేత్రస్తాయికి వెళ్లి సమస్యలను పరిశీలిం చాలన్నారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన 31 అర్జీలను స్వీకరించారు. తొలుత అదనపు కమిషనర్ డయల్ కమిషనర్ ద్వారా ఫోన్‌లో 27 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య నగర్‌లో సిమెంట్ రోడ్లు పూర్తి చేయాలి

స్థానిక 41వ వార్డు, సుందరయ్య నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం నాయకులు గ్రీవెన్స్‌లో మేయర్, అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆది నికల్సన్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మౌలిక వసతులకు ఆమడదూరంలో ఉన్నామని, అనేక సంవత్సరాల నుండి కోరుతుంటే ఇటీవల 1, 2, 5 లైన్లు పూర్తిగా, 3వ లైన్‌లో కొంత మేర సిమెంట్ రోడ్డు నిర్మించారన్నారు. 3వ లైన్‌లో పూర్తి చేయాలని, 4, 6నుండి 10వ లైన్ వరూ సిమెంట్ రోడ్లు వేయాలని కోరారు. అలాగే 10వ లైన్‌లో సైడు కాలువ నిర్మాణం పెండింగ్‌లో ఉందన్నారు. మెయిన్ రోడ్ నుండి కాలనీకి వెళ్లే అప్రోచ్ రోడ్‌ను సిమెంట్ రోడ్డు వేసి, మార్జిన్‌లో డస్ట్ వేయకపోవటం వల్ల రోడ్డు పాడైపోతుందన్నారు. రోడ్లు వేయకపోవటం వల్ల వర్షపు నీరు నిలిచి దోమలు వ్యాపించి, రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. కావున ఆయా సమస్యలను పరిస్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్, అదనపు కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే రోడ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అర్జీ ఇచ్చిన వారిలో కాలనీ కమిటీ అధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి, షేక్ ఖాశిం షహీద్, ఎం.అచ్యుతకుమారి, మునగా పద్మ, షేక్ సుభాని, నాగలక్ష్మి తదితరులున్నారు.

అర్జీ అందచేసిన సుందరయ్య నగర్ కమిటీ నాయకులు నికల్సన్, మస్తాన్‌వలి తదితరులు